ప్రజాశక్తి

శనివారం 18 మే 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా







సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డికె.బాలాజీ

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు

కృష్ణాజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాలాజీ ఆదేశం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో, ఓట్ల లెక్కింపుపై దష్టి సారించాలని, అందుకు తగిన ఏర్పాట్లు పక్కాగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ లోని స్పందన మీటింగ్ హాల్లో రిటర్నింగ్ అధికారులు, పోస్టల్ బ్యాలెట్, మ్యాన్ పవర్ మేనేజ్మెంట్, మెటీరియల్ మేనేజ్మెంట్ నోడల్ అధికారులతో, ఎన్ఐసి, ఎన్ కోర్ బందాలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జూన్ నెల 4వ తేదీ కష్ణా విశ్వవిద్యాలయంలో కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటినుంచి చేపట్టాలన్నారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారి పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి ఓట్ల లెక్కింపు టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బందిని నియమించాలన్నారు. వారికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు.కౌంటింగ్ హాలు పక్కనే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు వేరే రూములో టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు.అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు, జిరాక్స్ మిషన్ తో పాటు రైటింగ్ ప్యాడ్స్, పెన్స్, పెన్సిల్స్, క్యాలిక్యులేటర్ వంటి మెటీరియల్ సిద్ధం చేయాలని మెటీరియల్ మేనేజ్మెంట్ నోడల్ అధికారికి సూచించారు. ఓట్ల లెక్కింపు ఫలితాలు రౌండ్ల వారిగా కౌంటింగ్ హాల్, కమ్యూనికేషన్ రూమ్, మీడియా రూమ్ ల నందు డిస్ప్లే ఏర్పాట్లు చేయాలని ఐటి సిబ్బందికి సూచించారు. ఓట్ల లెక్కింపు హాళ్లలో బారికేడింగ్ పనులు చేపట్టాలని, సిబ్బంది పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్ లోనికి ప్రవేశ మార్గాలు, సూచికలు ఏర్పాటు చేయాలని, వాటిని స్వయంగా ప్రాక్టికల్గా పరిశీలిస్తామన్నారు. ఈనెల 26వ తేదీన మరల సమావేశం నిర్వహిస్తామని, మోడల్ ఈవీఎంల ఓట్ల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు మోడల్ టేబుల్స్, లెక్కింపు ప్రక్రియ, ఫలితాల ప్రకటన అంశాలన్ని మోడల్ గా స్పందన మీటింగ్ హాల్లో ఏర్పాటు చేయాలని, ప్రాక్టికల్ గా పరిశీలించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బంది, అధికారుల మొబైల్ ఫోన్స్ డిపాజిట్ కౌంటర్ ఒక రూములో ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్, గన్నవరం

(మిగతా 2లో)

సమస్యల సుడిలో జిల్లా ప్రజలు

- ఎన్‌టిటిపిఎస్ కాలుష్యంతో అవస్థలు
- దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఏ కొండూరు గిరిజన రైతుల బకాయిలు
- మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు శూన్యం
- పడకేసిన పారిశుధ్యం
- అస్తవ్యస్తంగా డ్రైనేజ వ్యవస్థ

ప్రజాశక్తి - విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లాలో ప్రజల సమస్యలు తిష్టవేశాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉందనే పేరుతో అధికారులు అత్యవసర సేవలను కూడా పూర్తిగా విస్మరిస్తున్నారు. దీని వల్ల సమస్యలు ఎప్పటికి పరిష్కారం అవుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మంచినీటి సరఫరా, పారిశుధ్యం, వైద్య సేవలు, దోమల నివారణ, పాలనా నిర్వహణ, కాలుష్య నివారణ, పెండింగ్‌లో ఉన్న రైతుల పంట బకాయిలు, సమ్మర్ యాక్షన్ ప్లాన్ తదితర అనేక సమస్యలు మూలనపడ్డాయి. గత రెండు మాసాల నుంచి జిల్లా స్థాయి అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలు కాగా, ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారంలో మునిగిపోయారు. జూన్ 4 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉందనే ఆలోచనతో ప్రజాసమస్యలను గాలికొదిలేసినట్లుగా తయారైంది అధికారుల తీరు. ఎన్‌టిఆర్ జిల్లాలో అత్యవసర సర్వీసులతోపాటు దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారంకోసం ఎదురు చూస్తున్నాయి. ప్రధానంగా విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్‌టిటిపిఎస్) నుంచి వెలువడే కాలుష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీని సమీపంలోని 10 గ్రామాలకు చెందిన 40 వేల నుండి 50 వేల కుటుంబాల వారు కాలుష్య సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. దీని కాలుష్యం ప్రభావంతో ఆయా గ్రామాల్లోని భూగర్భ జలాలు కూడా కలుషితమవుతున్నాయి. అంతేగాక విజయవాడకు సరఫరా అవుతున్న కృష్ణా నది నీటిలో కూడా బూడిద/మసి కలిసి కలుషితం అవుతున్నాయి. గాలి కూడా కలుషితం అవుతోంది. నీరు, గాలి కాలుష్యంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు



పలురకాల అనారోగ్యాలకు గురవుతున్నారు. ఎన్‌టిటిపిఎస్ సమీప గ్రామాల మీదకు పొగ వ్యాపిస్తోంది. రెండు మూడేళ్ల నుండి బూడిద, మసి వెలువడటం ఎక్కువైంది. ప్రధానంగా ఎన్‌టిటిపిఎస్ సమీపంలోని కొండపల్లి, రాయనపాడు, గుంటుపల్లి, జూపల్లి, గొల్లపూడి తదితర గ్రామాలు కాలుష్యం బారినపడుతున్నాయి. తమను దీని కాలుష్యం బారి నుంచి కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాసంఘాలు, వామపక్షాల వారు రాజకీయాలకతీతంగా పలు సందర్భాల్లో కొండపల్లి, ఇతర గ్రామాల్లో ఆందోళనలు నిర్వహించారు. ప్రజలు ఆందోళన చేసిన సమయంలో కాలుష్యం నివారణకు తక్షణమే ప్రత్యమ్నాయ చర్యలు తీసుకుంటామని ఎన్‌టిటిపిఎస్ యాజమాన్యంతోపాటు జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు హామీలు

(మిగతా 2లో)

ఉపాధి హామీ పనులపై నిర్లక్ష్యం

- కార్మికులకు అరకొరగానే పనులు
- యంత్రాలతో తవ్వకాలు

ప్రజాశక్తి - పెడన : గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు, పేద రైతులకు పట్టెడన్నం పెట్టాలన్న సహదయంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొందరు సరిగా అమలు చేయడంలేదు. పెడన మండలంలో అధికారులు ఈ చట్టాన్ని సరిగా అమలు చేయకుండా కార్మికుల పొట్టకొడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. కౌతరం కెనాల్ గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు నుండి పెడన మండల పరిధిలోని గురువింద గుంట, కొప్పల్లి, కవిపురం గ్రామాలకు సాయిరాజ్ ఛానల్ నుంచి వెళ్లే పంట బోధి 1100 మీటర్లు దూరం తవ్వేందుకు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇందుకు 418 మంది వ్యవసాయ కార్మికులతో లక్షా 56 వేల 825 ఖర్చవుతుందని అంచనాల కూడా వేసి ఆమోదం తెలిపారు. అయితే వీటిలో కేవలం 200 మీటర్ల దూరం వరకు మాత్రమే కార్మికులతో తవ్వించినట్లు తెలిసింది. మిగిలిన దూరాన్ని పొక్లయినర్‌తో తవ్వేశారని



తెలిసింది. దీంతో కార్మికులకు ఉపాధి కోల్పోయారు. అసలే గత ఐదేళ్లుగా రబీ (దాళ్వా) పంట లేక పోవడంతో పూట గడవడమే కష్టమవుతోందని, ఇలాంటి తరుణంలో యంత్రాల సహాయంతో పంట బోదెలతో తవ్వించడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పెనుమల్లి పంచాయతీ మంచినీటి చెరువుకి నీళ్లు వెళ్లే పంట బోదె, నేలకొండపల్లి గ్రామంలోని మరో రెండు బోదెలు, అలాగే నడపూరు నుంచి కూడూరు, నందిగామ వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుకు కుడివైపు ఉన్న పంట బోదెలు, అచ్చియ్యవారిపాలెం గ్రామంలోని మరో రెండు పంట బోదెలు.. ఇలా మండల పరిధిలోని చాలా గ్రామాల్లో కార్మికులకు పని కల్పించకుండా యంత్రాల సహాయంతో పనులను చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ పథకంలోని ఏ పనికి కూడా యంత్రాలను ఉపయోగించకూడదు. ఒకవేళ ఉపయోగించాల్సిన అవసరం వస్తే జిల్లా స్థాయి అధికారుల అనుమతులు తీసుకునే వీటిని చేయాల్సి ఉంటుంది. అయితే రైతులకు అత్యవసరమైన పంట బోదెలను లోతుగా తవ్విస్తున్నామంటూ కార్మికులను

(మిగతా 2లో)

ప్రబీర్ పుర్కాయస్థ అక్రమ అరెస్టుపై

సుప్రీం తీర్పును స్వాగతిస్తూ నేడు సభ

'అలుపెరుగని పోరాటం' పుస్తకాన్ని ఆవిష్కరించనున్న లక్ష్మణరావు

ప్రజాశక్తి - విజయవాడ

ప్రబీర్ పుర్కాయస్థ అక్రమ అరెస్టుపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిసూ శనివారం సాయంత్రం 6 గంటలకు విజయవాడ గవర్నరుపేటలోని బాలోత్సవ్ భవన్లో సభ జరుగుతుంది. ఈ సభలో వక్తలుగా ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్, సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ చెన్నుపాటి దివాకర్ బాబు, ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు



పాల్గొంటారు. ఈ సందర్భంగా ప్రబీర్ పుర్కాయస్థ ఆత్మకథ 'అలుపెరుగని పోరాటం' ఆవిష్కరణ జరుగుతుంది. ఈ పుస్తకాన్ని పిడిఎఫ్ శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు ఆవిష్కరిస్తారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ పూర్వ సంపాదకులు కె.ఉషారాణి పరిచయం చేస్తారు. సాంస్కృతిక కార్యకర్త గోళ్ల నారాయణరావు అధ్యక్షత వహిస్తారు. ఈ కార్యక్రమం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు), రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక, కామ్రేడ్ జిఆర్‌కె – పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరుగుతుంది.

కృష్ణాజిల్లాలో నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్ల తాజా సమాచారం

కృష్ణాజిల్లాలో నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు

అసెంబ్లీ పేరు	మొత్తం ఓట్లు	మొత్తం పోలైన ఓట్లు	శాతం	పోస్టల్ ఓట్లు	హోం ఓట్లు	మొత్తంపోలైన ఓట్లు	శాతం
1.గన్నవరం	2,79,054	2,36,848	84.88	2,425	272	2,39,545	85.84
2.గుడివాడ	2,04,271	1,68,537	82.51	3,066	160	1,71,763	84.09
3.పెడన	1,67,564	1,48,413	88.57	1,533	117	1,50,063	89.56
4.మచిలీపట్నం	1,96,680	1,61,109	81.91	3,745	192	1,65,046	83.92
5.అవనిగడ్డ	2,12,331	1,82,600	86.00	3,444	395	1,86,439	87.81
6.పామర్రు (ఎస్‌సి)	1,84,632	1,62,683	88.11	1,981	222	1,64,886	89.31
7.పెనమలూరు	2,94,928	2,33,413	79.14	3,220	367	2,37,000	80.36
జిల్లా మొత్తం	15,39,460	12,93,603	84.45	19,414	1,725	13,14,742	85.40

పెట్రోల్ పోసి హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - విజయవాడ

పెట్రోల్ పోసి ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితునికి యావజ్జీవ కఠిన కారాగారా శిక్ష విధిస్తూ 8వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు (ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ విజయవాడ) న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కష్ణా జిల్లా గన్నవరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నెంబర్. 119/2020 సెక్షన్ 302 ఐపీసీ కేసులో నిందితుడైన గన్నవరం మండలం అజ్జంపూడి గ్రామానికి చెందిన కొడవలి శివ అలియాస్ నానికి విజయవాడ 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు (ఫాస్ట్రాక్ కోర్టు) న్యాయమూర్తి డి.లక్ష్మి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. గన్నవరం మండలం అజ్జంపూడి గ్రామం సిఎస్‌ఐ చర్చి వద్ద నివాసం ఉండే తాడంకి నాగబాబు (21) 2020 మార్చి 12వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో వికెఆర్ కళాశాల రోడ్డుకు బహిర్భూమి నిమిత్తం ఎపి 16 సిడి 0040 నెంబర్ గల హోండా షైన్ వేసుకుని వెళ్లాడు. ఉదయం 6.30 గంటల సమయంలో నిందితుడు శివ పథకం ప్రకారం అక్కడికి వెళ్లి నాగబాబు కళ్లల్లో కారం కొట్టి, తనతో ప్లాస్టిక్ బాటిల్లో తెచ్చుక్కున్న పెట్రోల్‌ను పోసి నిప్పంటించాడు. చుట్టుపక్కల వారు ఇచ్చిన సమాచారంతో నాగుబాబు సోదరుడు తాడంకి జోజిబాబు సంఘటనా స్థలానికి వెళ్లగా, నాగబాబు కాలిన గాయాలతో మాట్లాడలేని పరిస్థితితుల్లో పడి ఉన్నాడు. వెంటనే పోరంకిలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లాడు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మార్చి 13వ తేదీన మరణించాడు. నిందితుడి భార్యతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. జోజిబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపి అదే గ్రామానికి చెందిన కొడవలి శివ నిందితుడిగా తేల్చారు. అప్పటి ఎస్ఐ జి.రమేష్ బాబు క్రైం నెంబర్. 119/2020 సెక్షన్ 302 ఐపీసీగా కేసు నమోదు చేసి నిండుతుడిని అరెస్ట్ చేశారు. అనంతరం సిఐ కె.శివాజీ విచారణ పూర్తి చేసి చార్జిషీటును కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ చేపట్టిన 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు (ఫాస్ట్రాక్ కోర్టు) డి.లక్ష్మి... పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ జి.కల్యాణి ఆధ్వర్యంలో 18 మంది సాక్షులను విచారించారు. నిందితునిపై నేరం రుజువు కావడంతో గురువారం ముద్దాయికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. జరిమానా కట్టకపోతే 15 రోజులు అదనపు సాధారణ జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా గన్నవరం సబ్ డివిజన్ డిఎస్‌పి ఆర్.జె. జయసూర్య పర్యవేక్షణలో గన్నవరం ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్.వి.ప్రసాద్‌ను, ఇతర పోలీసు సిబ్బందిని కష్ణా జిల్లా ఎస్‌పి అద్నన్ నయీం హష్మి అభినందించారు.

మొదటిపేజీ తరువాయి



సమస్యల సుడిలో జిల్లా ప్రజలు

ఇస్తున్నారు. కానీ ఆ తర్వాత ఆ హామీలు బుట్టదాఖలవుతున్నాయి. కాలుష్యం నివారణకు నిపుణుల కమిటీ సూచించిన అనేక సలహాలు, సూచనలను యాజమాన్యం పరిగణలోకి తీసుకోవడం లేదు. ఎన్‌టిటిపిఎస్ నుండి వెలువడే మసి, బూడిద ఇతర ప్రమాదకర కారకాలు గాలిలోకి పంపే గొట్టాలు పొడవు పెంచాలని, ప్రత్యమ్నాయ చర్యలు తీసువాలని అనేక మంది నిపుణులు సూచిస్తున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా యాజమాన్యం, జిల్లా అధికారులు స్పందించి ప్రజలను కాలుష్యం నుంచి కాపాడటానికి తక్షణం ప్రత్యామ్నాయం చర్యలు చేపట్టాలని ప్రజలు, ప్రజాసంఘాల వారు డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. డ్రైనేజి వ్యవస్థ దెబ్బతిన్నది. వేసవిలో సైతం దోమల బెడద ఎక్కువైంది. దోమల మందు స్ప్రేచేసే నాధుడే లేకుండా పోయింది. నిధుల సమస్యతో పంచాయతీలు కునారిల్లుతున్నాయి. మండల కేంద్రమైన ఎ.కొండూరు గ్రామానికి చెందిన 14 మంది గిరిజన రైతులు పండించిన పంటకు మార్కెటింగ్ శాఖ ద్వారా చేయాల్సిన రూ.10.85 లక్షల నగదు చెల్లింపులు సుదీర్ఘకాలంగా జరగడంలేదు. దీంతో బాధిత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎ. కొండూరు మండల మార్కెటింగ్ శాఖ అధికారుల ద్వారా 2021 మార్చిలో గిరిజన రైతులు తమ వరి పంటను విక్రయించారు. గడిచిన మూడేళ్ల వ్యవధిలో ఇద్దరు కలెక్టర్లు, మరో ఇద్దరు జిల్లా జాయింట్ కలెక్టర్లు, పలువురు ఐఎఎస్ అధికారులు, డిప్యూటీ కలెక్టర్లు మారినా ఆ రైతులకు చెల్లించాల్సిన డబ్బుల చెల్లింపులు మాత్రం జరగడం లేదు. రైతులకు మద్దతుగా రైతు, కౌలురైతు సంఘాలు, సిపిఎం వారు పలుసార్లు ఎ కొండూరు గ్రామంలో రైతులతో కలిసి ఆందోళనలు చేశారు. దీంతోపాటు రిలే దీక్షలు కూడా చేపట్టారు. మండల కేంద్రంతోపాటు జిల్లా కేంద్రంలో జరిగే గ్రీవెన్స్‌లో సిపిఎం జిల్లా కార్యదరి డివి.కృష్ణ పలుసార్లు రైతులను కలుపుకొని వినతిపత్రాలు సమర్పించారు. కలెక్టర్ ఎస్.డిల్లీరావుకు ఇటీవల కాలంలో పలుసార్లు అర్జీలు కూడా సమర్పించారు. అయినా గిరిజన రైతులకు చెల్లించాల్సిన లక్షలాది రూపాయల నగదు చెల్లింపులు జరగలేదు. ఎన్నికలకు ముందు వరకూ కూడా రైతులను కలుపుకొని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావును జిల్లా కలెక్టరేట్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ కలిసి వివరించారు. రైతుల పెండింగ్ బకాయిలను సత్వరమే చెల్లిస్తామని మార్కెటింగ్‌శాఖ అధికారులతో పాటు జిల్లా అధికారులు చేస్తున్న హామీలన్నీ బుట్టదాఖలయ్యాయి. ఇప్పట్కిఐనా తీవ్ర ఇబ్బందుల్లో బాధిత రైతులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. జిల్లాలో లక్షలాది మంది కూలీ నాలీ చేసుకొని జీవిస్తున్న పేదలకు ఎంతో ఆసరాగా ఉన్న 'మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీచట్టం' (ఎన్‌ఆర్‌జిఎస్) పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. కొన్ని గ్రామాల్లో ఈ పథకం పేరుతో చెరువుగట్లు పటిష్టం చేయడం, పూడిక తీత పనులు, చెట్ల పెంపక, వనాల పెంపు తదితర పనులు అడపాదడపా జరిగే గ్రామాల్లో కార్మికులకు ఎండవేడిమిని తట్టుకునే విధంగా షెల్టర్, మంచినీరు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఇతర వైద్యసేవలు అందించాల్సి ఉంది. అయినా ఏ ఒక్కటీ కూడా అమలు కానందున కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా మండిపడుతోంది. మంచినీటి సమస్య కూడా పలు గ్రామాల్లో నెలకొంది. కొండపల్లి, నందిగామ, ఏ కొండూరు మండలంలోని పలు గ్రామాల్లో ఫ్లోరిన్ సమస్యతో పాటు మంచినీటి పైప్‌ల ద్వారా మంచినీటి సరఫరా సరిగా జరగడంలేదు. దీంతో గుక్కెడు మంచినీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటిని వాటర్ ట్యాంకర్ల ద్వారా పూర్తి స్థాయిలో సరఫరా కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




ఉపాధి హామీ పనులపై నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

విస్మరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

బోదెల తవ్వకం పనుల్లో యంత్రాల వినియోగం!

గ్రామీణ ప్రాంతాల్లో బుసక, నల్ల రేగడి మట్టికి ప్రస్తుతం మంచి గిరాకీ ఉంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో రెవెన్యూ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో మట్టి తవ్వకాలను నిషేధించారు. ఇదే అదునుగా భావించిన కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు అధికారులతో కుమ్మక్కై పంట బోదెలను మెరక లోతుగా తీస్తున్నామంటూ ఆయా గ్రామాల్లోని కార్మికులను, రైతులను నమ్మబలికిస్తున్నారు. పొక్లయినర్లు, జెసిబిలు, ట్రాక్టర్ల ద్వారా బోదెల్లోని బుసక, మట్టిని ఆయా గ్రామాల్లోని గహ నిర్మాణ పనులకు, అలాగే ఖాళీ స్థలాల్లోనూ మెరక చేయించుకునేందుకు అమ్ముతున్నారు. అలాగే నల్ల రేగడి మట్టిని ఇటుక రాయి తయారుచేసి బట్టీల వారికి అమ్ముకుని లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ వైపు కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నామంటూ అంచనాల రూపొందించి, నిధులను వెచ్చించి, ఇలా మరోవైపు యంత్రాలతో మట్టిని తరలించి అమ్ముకుంటూ లక్షల రూపాయలు దండుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విచారించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. దీనిపై ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎపిఒ ఎమ్‌డి.నజీర్‌ను వివరణ కోరగా అచ్చుయ్యవారిపాలెంలో ఈ పథకం కింద అమలు చేసిన పంట బోదెలను కొందరు తవ్విన మాట వాస్తవమేనని, వాటిని నిలుపుదల చేశామని చెప్పారు. అలాగే మిగిలిన గ్రామాల్లో కూడా కార్మికులు తవ్వే అడుగు లోతు చాలక పోవడంతో కొందరు తవ్వుకుంటున్నారని వివరణ ఇచ్చారు.





పకడ్బందీగా ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మ, డి ఆర్ ఓ కే చంద్రశేఖర రావు, బందరు, గుడివాడ, పెనమలూరు రిటర్నింగ్ అధికారులు ఆర్డిఓలు ఎం వాణి, పి పద్మావతి, డి రాజు, అవనిగడ్డ, పామర్రు, పెడన రిటర్నింగ్ అధికారులు బాలసుబ్రమణ్యం, శ్రీదేవి, పి వెంకటరమణ, సర్వే ఏడి మనీషా త్రిపాటి, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు : కలెక్టర్



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ వి.సీ. హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి జిల్లా రెవిన్యూ అధికారి కే చంద్రశేఖరరావు తో కలిసి రెవెన్యూ, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో గొడవలు, అవాంఛనీయ సంఘటనలు జరిగిన దష్ట్యా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎక్కడా కూడా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా గొడవలు గాని, దాడులు గాని ఎట్టి పరిస్థితులలో జరగకూడదని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో తహసిల్దారులు పోలీసు శాఖ అధికారులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలతో సమన్వయం చేసుకొని ప్రతిరోజు శాంతి భద్రతలపై నివేదిక పంపాలన్నారు. ఎక్కడైనా హింసాత్మక సంఘటనలు జరిగితే తక్షణమే స్పందించి నియంత్రించేందుకు గట్టి చర్యలు చేపట్టాలన్నారు. వీఆర్వోలు వీఆర్‌ఏలు గ్రామాల్లో ప్రజలతో మమేకమై ఎటువంటి అలజడులు వచ్చే అవకాశం ఉన్న ఆరా తీయాలని సూచించారు.అలాగే చెక్ పోస్ట్ ల వద్ద గట్టి నిఘా ఉంచాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు ఎస్పీ జి. వెంకటేశ్వరరావు, మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, గుడివాడ పెనమలూరు, పామర్రు రిటర్నింగ్ అధికారులు ఎం వాణి, పి వెంకటరమణ, జి బాల సుబ్రమణ్యం, పి.పద్మావతి, డి రాజు, శ్రీదేవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య, డిఎస్పీలు రమేష్ బాబు, నాగరాజు, తహసిల్దార్లు వీఆర్వోలు, వీఆర్‌ఏలు తదితర అధికారులు పాల్గొన్నారు

అవనిగడ్డలో ఐదు సెంటీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో గురువారం నుండి శుక్రవారం మధ్యాహ్నం వరకు 5.15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. రెండు రోజుల నుండి జల్లులుగా పడుతున్న వర్షానికి దివిసీమ ప్రాంతం అంతా చల్లబడ గా కొన్ని పంటలకు మాత్రం నష్టం వాటిల్లింది ముఖ్యంగా ఈ వర్షం వల్ల మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిళ్లనున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షంతో మామిడి పంటకు పురుగు సోకే ప్రమాదం ఉందని దీనితో తీవ్ర నష్టం వాటిలనున్నట్లు తెలిపారు. అదేవిధంగా దోస, బీర లాంటి తోటలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అయితే ఎండల తీవ్రతకు అల్లాడిపోతున్న ప్రజలకు గత రెండు రకాలుగా కురిసిన వర్షాలకు ఊరట చెందినట్లు కనిపిస్తోంది. ఇంకా వారం రోజుల్లో రోహిణి కార్తి ప్రవేశించునున్న నేపథ్యంలో కురుస్తున్న వర్షాలతో రోహిణి కార్తి ప్రభావం అంతగా ఉండకపోవచ్చునని తెలుస్తుంది. మరోవైపు నైరుతి రుతుపవనాలు కూడా జూన్ మొదటి వారంలోనే ప్రవేశించనున్నట్లు తెలియడంతో ప్రజలతోపాటు రైతుల్లో కూడా ఆనందం వెల్లి విరుస్తోంది. గతంలో వాతావరణ శాఖ చెప్పినట్లుగా ఏప్రిల్ మే జూన్ తీవ్రమైన ఎండలు ఉంటాయని హెచ్చరించిన నేపథ్యంలో అనుకోకుండా వర్షాలు పడడం ఎండవేడికి తట్టుకోలేమేమో అన్న భయం పోయినట్లయింది.



రామిరెడ్డి చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ నేత రాచూరి రామిరెడ్డికి నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఉపాధ్యాయ ఉద్యమ నేత రాచూరి రామిరెడ్డి వర్ధంతి సభ అవనిగడ్డ యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బి కనకారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుతా రామిరెడ్డి చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కనకారావు మాట్లాడుతూ 20 సంవత్సరాల పాటు రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసి యుటిఎఫ్ ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో దశదిశల వ్యాపింప చేశారన్నారు. అదేవిధంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించడంలోనూ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేయడంలో ఆయనది ప్రత్యేక స్థానం అన్నారు. శాసనమండలి సభ్యునిగా అనేక పర్యాయాలు చేసి ఉపాధ్యాయులకు రాయితీలు సాధించి పెట్టారన్నారు. స్కేల్స్ ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీమ్స్ సాధించడంలో ఆయన కృషి అద్వితీయమన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే జీవేంద్రరావు, బి శివరామకష్ణ, ఉపాధ్యక్షులు సింహాద్రి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు పివి ఆంజనేయులు, మోపిదేవి మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ స్వామి, బందెల గోవర్ధన్‌రావు, వి వి వి గోవిందరావు, బడే దాశరధి, యా సం శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు వేసేందుకు పోటీపడిన ఓటర్లు

- గన్నవరంలో 85 శాతం పోలింగ్ నమోదు

ప్రజాశక్తి-గన్నవరం : అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గంలో ఓటర్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓట్లు వేశారు. 85 శాతం పోలింగ్ జరగడమే అందుకు నిదర్శనం. ఇందులో మహిళలు అధికంగా ఓట్లు వేయడం విశేషం. ముఖ్యంగా యువత పట్టుదలతో వచ్చి ఓట్లు వేయడం కనిపించింది. నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,76,054 ఉండగా, వీరిలో 2,36,848 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామాల వారీగా పరిశీలిస్తే... నున్న పంచాయతీలో 11,988 ఓట్లు, పాతపాడు లో 2,973 ఓట్లు, పి.నైనవరంలో 1441 ఓట్లు, అంబాపురం 3127 ఓట్లు, రామవరప్పాడు పంచాయతీలో 15,984 ఓట్లు, ప్రసాదంపాడు లో 15,102 ఓట్లు, ఎనికేపాడులో 9102 ఓట్లు, నిడమానూరులో 8547 ఓట్లు, గూడవల్లి లో 1881 ఓట్లు, జక్కుల నెక్కలంలో 673, సావరగూడెంలో 957 ఓట్లు, ముస్తాబాద్ లో 5699, సూరంపల్లి పంచాయతీలో 5066, మాదలవారిగూడెంలో 1949, పురుషోత్త పట్నంలో 1499, కొండపావులూరులో 2136, గోపవరపు గూడెంలో 1213 ఓట్లు పోలయ్యాయి. గొల్లనపల్లిలో 1994, చిక్కవరంలో 1435, కొత్తగూడెంలో 797, బీబీగూడెంలో 1477, మెట్ల పల్లిలో 445, వీరప నేని గూడెంలో 2709, తెంపల్లిలో 2560, చిన్న అవుటపల్లి లో 1612, గన్నవరం పంచా యతీలో 13,910 ఓట్లు పోలయ్యాయి. దావాజీ గూడెంలో 3694, అల్లాపురంలో 1599, కేసరపల్లి పంచాయతీలో 8278, అజ్జంపూడిలో 774, బుద్ధ వరంలో 2853, బూతిమిల్లిపాడు లో 329, రాయన పాలెంలో 2013, అంబాపురంలో 1052, కోడూరుపాడు లో 1390, ఉమామహేశ్వరపురం లో 1649, శోభనాద్రిపురంలో 841 ఓట్లు పోలయ్యాయి. వీరవల్లిలో 4706, రంగన్నగూడెంలో 1340, సింగన్నగూడెంలో 960, వేలేరులో 3188, కొత్త రేమల్లెలో 2939, మల్ల వల్లిలో 3238, కొత్త మల్లవల్లిలో 745, బిళ్ళనపల్లిలో 1208, కొత్తపల్లిలో 2029, మడిచర్లలో 3070, బాపుల పాడులో 10,534 ఓట్ల పోలింగ్ జరిగింది. బొమ్ము లూరులో 2299, కొయ్యూరులో 1238, నరసింహ పాలెం లో 856, కే. సీతారామపురంలో 1610, కాను మోలులో 4553, దంటగుంట్ల 721, కాకులపాడులో 1632, రామన్నగూడెం లో 491, ఆరుగొలను లో 2516, ఓగిరాలలో 1619, తిప్పన గుంటలో 907, వెంకటరాజు గూడెంలో 278, చిరివాడలో 1208, సీతారామపురంలో 1699, ఉంగుటూరు మండలం పెద అవుటపల్లి లో 5309, ఆత్కూరులో 4001, పొట్టిపాడు లో 1987, తేలప్రోలు లో 6399, గారపాడు లో 665, పొను కుమాడులో 696, వెన్ను తలలో 401, తుట్టగుంటలో 208, వెల్దిపాడులో 882, నాగవరప్పాడు లో 753, ఉంగుటూరులో 1722, ఎలుక పాడులో 390, లంకపల్లిలో 715, ముక్కపాడులో 619, ఆముదాల పల్లిలో 568, కొయ్యగూ రపాడులో 850, తరిగొప్పుల లో 1714, వేంపాడు లో 1030, చాగంటిపాడులో 638, బొకినాలలో 655, ఇందుపల్లిలో 2414, మధిరపాడులో 336, వేమండ లో 913, నందమూరి లో 1090, మానికొండ పంచాయితీలో 4,544 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా చూస్తే 2,36,848 ఓట్లు పోలింగ్ జరిగింది.



గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- కోడూరు : కోడూరు మండల శివారు ఉల్లిపాలెం గ్రామ సమీపాన కష్ణా నదిలో గుర్తు తెలియని పురుషుని మృత దేహం లభ్యమైనట్లు కోడూరు ఎస్ఐ పి.శిరీష తెలిపారు. గురువారం రాత్రి ఉల్లిపాలెం పడవల రేవు సమీపంలో మృత దేహం కనిపించిందని స్థానికులు అందిన సమాచారం మేరకు మృతదేహాన్ని పరిశీలించినట్లు ఎస్ఐ తెలిపారు. మతునికి సుమారు 40,45 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, గురుతెలియని విధంగా బాడీ కుళ్ళిపోయిందని తెలిపారు. పోస్టుమార్టం చేయించి మత దేహాన్ని ఖననం చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశకి-మచిలీపట్నంరూరల్ : హౌసింగ్ బోర్డ్ విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతులు జరుగుతున్న కారణంగా శనివారం ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని మచిలీపట్నం ఎక్జిక్యూటివ్ఇంజనీర్, ఎం భాస్కరరావు తెలిపారు. ఈడేపల్లి శ్రీనివాస్ నగర్ కాలనీ, పంచాయతీరాజ్ ఎంప్లాయిస్ కాలనీ, నారాయణపురం, పంబలగూడెం, టెంపుల్ కాలనీ,డ్రైవర్స్ కాలనీ,పాత హౌసింగ్ బోర్డ్,కొత్త హౌసింగ్ బోర్డ్,డి మార్ట్ రోడ్, మాచవరం,ఆనందపేట మరియు వలంద పాలెం ఏరియాలలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్యామలానంద ప్రసాద్

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని త్యాగరాజ మందిరంలో త్యాగరాజు 257వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కీర్తిశేషులు పాలపర్తి సుబ్బారావు స్మారక అర్థం నిర్వహించిన వేమన సుమతి శతక పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మానేపల్లి సరస్వతి ప్రథమ స్థానం సాధించగా బి శ్రీసుహిత ద్వితీయ స్థానం, నంబూరి నిర్మలాదేవి, తతీయ స్థానం సాధించారు. వారికి పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. అనంతరం గాత్ర కచేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంగళంపల్లి బాలమురళీకష్ణ శిష్యుడు కస్తూరి గోపాలరావు వాయి లీనం, చావలి శ్రీనివాసరావు మదంగం, చావలి కష్ణమోహన్ త్యాగరాజ స్వామి కతులను అద్భుతంగా ఆలపించి ప్రేక్షకుల మనన్లు పొందారు. తెలుగు సావిడి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొన్న వారందరినీ సత్కరించి పాటల పోటీలలో విజేతలకు శ్రీమతి ఆర్థిక బహుమతులు అందించారు.

బస్‌స్టాఫ్‌లో నిలిచిన నీరు

- ప్రయాణికుల ఇక్కట్లు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరంలో శుక్రవారం ఉదయం కురిసిన వర్షానికి బస్‌స్టాప్‌లో నీరు నిలిచిపోయింది. చెరువులా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బస్టాప్‌లో నిలబడేందుకు వీలు లేకుండా పోయింది. బుద్ధవరం రోడ్లో వెళ్లేవారు మురుగు నీటిలో వెళ్లాల్సి వచ్చింది. ఇక్కడ డ్రైనేజీ పూడిపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. డ్రైనేజీలో చెత్త తీయించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బస్ స్టాప్‌లో నిలిచిన నీరు



దాతను అభినందిస్తున్న దృశ్యం

ఠాగూర్ గ్రంథాలయానికి సిసి కెమెరాల బహూకరణ

విజయవాడ :

ఠాగూర్ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరంలో వివిధ అంశాలపై నిపుణులతో శిక్షణ ఇస్తున్నారు. గ్రంథాలయ విశిష్టతను గుర్తించి విద్యార్థులకు రక్షణ, పుస్తకాల రక్షణ కోసం పుట్టి వెంకటేశ్వరరావు 14వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం వారి కుమార్తె పుట్టి నాగలక్ష్మి ఠాగూర్ గ్రంథాలయానికి నాలుగు సిసి కెమెరాలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ తండ్రి వర్ధంతి సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు చేస్తూ అందులో భాగంగా ఈ సంవత్సరం టాగూర్ లైబ్రరీకి నాలుగు సిసి కెమెరాలు అందించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ జీవి పూర్ణచంద్ర, గుత్తికొండ సుబ్బారావు, బాలా త్రిపుర సుందరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టి వెంకటేశ్వరరావు సామాజిక సేవా సంస్థ కార్యక్రమాలను కొనియాడారు. ఠాగూర్ గ్రంథాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థుల ప్రతిభను గమనించారు ప్రతిభను గమనించి చిన్నారులను ప్రోత్సహించారు. గ్రంథాలయ సౌకర్యాలకు అవసరమైన వాటిని సమకూర్చడానికి గ్రంథాలయ అభివృద్ధికి ఠాగూర్ గ్రంథాలయ అధికారిని రమాదేవి నిరంతరం కృషి చేస్తున్నారు.

19న గరిమెళ్ల సుబ్బారావు స్మారక చిత్రలేఖనం పోటీలు

విజయవాడ :

ఈనెల 19 ఆదివారం గరిమెళ్ల సుబ్బారావు స్మారక చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీలు సృష్టిలో అమ్మ ప్రేమ అనే అంశంపై నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒకటో తరగతి నుండి పదో తరగతి చదివే విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు వారికి నచ్చిన ఏ మీడియంలోనైనా చిత్రాలు గీయవచ్చని వివరించారు. 1/4 సైజ్ డ్రాయింగ్ షీ2ట్ ఇస్తామని చెప్పారు. ప్యాడ్, క లర్స్, ఇతర అవసరమైన వస్తువులు ఎవరికి వారే తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు డ్రాయింగ్ షీట్ వెనుక తమ పేరు, తరగతి స్కూల్, మొబైల్ నెంబర్ తప్పనిసరిగా రాయాలని తెలిపారు. ఇచ్చిన అంశం మీద మాత్రమే చిత్రాలు గీయాలని అన్నారు. బొమ్మ గీసిన విధానానికి, రంగుల సమ్మేళనానికి పరిశుభ్రతకు మార్కులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

సెలక్షన్ కమిటీ సభ్యులు తుది నిర్ణయం తీసుకుంటారన్నారు. పోటీలో గీసిన చిత్రలు తిరిగి ఇచ్చేది ఉండదని తెలిపారు. ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. ఈ పోటీలకు ఈమెయిల్ (forumforartistsv-ja@gmail.com, వాట్సాప్ నెంబర్ 9347950085 ద్వారా పేర్లు నమోదు చేసుకున్నవారు మాత్రమే అర్హులన్నారు. పోటీ జరిగే ప్రదేశంలోకి తల్లిదండ్రులు, ఇతరులకు అనుమతి ఉండదని తెలిపారు. బహుమితి ప్రదానోత్సవం అదే రోజు రాత్రి ఉంటుందని తెలిపారు. ఈ పోటీలకు ఈవెంట్ ఆర్గనైజర్స్‌గా శ్రావణ్ కుమార్, లలితా సౌజన్య, బి.వి.ఎం.బి.లోకేష్, లక్ష్మీ ప్రియాంక, కాంటెస్ట్ కో ఆర్డినేటర్స్‌గా శివాజీ, గోపీ మనోజ్, ప్రవీణ్‌కుమార్, నదియా, హిమజ, స్ఫూర్తి, స్వేచ్ఛ, సింధూశ్రీ, రిజ్వాన వ్యవహరిస్తారని తెలిపారు.

కొనకళ్లకు పలువురు పరామర్శ



కొనకళ్ళ నారాయణరావును పరామర్శిస్తున్న బుద్ధా వెంకన్న, గద్దె రామ్మోహన్, నాగుల్ మీరా తదితరులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షులు, బందరు మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణ రావుకు గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు విజయ వాడలోని రమేష్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ధ్రువీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆసుపత్రిలో కొనకళ్ళని ఉత్తరాంధ్ర పార్లమెంటరీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, తూర్పు శాసన సభ్యులు గద్దె రామ్మోహన్‌లు పరామర్శించి, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు.

విద్యుత్ షాక్‌తో అపస్మారక స్థితిలో బాలుడు

సిపిఆర్ చేసిప్రాణం కాపాడిన మహిళా డాక్టర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

నగరంలోని బాలుడు విద్యుత్ షాక్‌కు గురవడంతో గుండె ఆగిపోయిన సందర్భంలో మహిళా డాక్టర్ మానవత్వం చాటారు. విషయాన్ని గమనించిన డాక్టర్ వెంటనస్త్ర సిపిఆర్ చేసి బాలుడు ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళితే నగరంలో ఉదయంనుండి భారీ వర్షం పడుతుది. అయితే అయ్యప్పనగర్‌ప్రాంతానికి చెందిన సాయి అనే ఆరేళ్ల బాలుడికి విద్యుత్ షాక్ తగలడంతో వెంటనే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు రోడ్డు మీదకు వచ్చారు. అటుగా వెళుతున్న రవళి అనే డాక్టర్ తల్లిదండ్రులు తమ బిడ్డను తీసుకుని రోడ్డుపై ఉండటం చూసి వెంటే ఆమె స్పందించి గుండె ఆగిపోయిందని గమనించారు. వెంటనే బాలుడిని అక్కడే రోడ్డుపై పడుకోపెట్ట కార్డియో పల్మనరీ రిసిసిటేషన్ (సిపిఆర్) చేసి ప్రాణాలు కాపాడారు. కొద్ది సేపు సిపిఆర్ చేసిన అనంతరం బాలుడు స్పృహలోకి వచ్చాడు. వెంటనే అప్పటివరకు ఆందోళనలో ఉన్న తల్లిదండ్రుల ఊపిరిపీల్చుకున్నారు. దీనితో అక్కడున్న వారంతా డాక్టర్ చేసిన సాయానికి కృతజ్ఞతలు తెలిపారు. తరువాత తల్లిదండ్రులు బాలుడిని సమీపంలోని ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యుల ప్రాథమిక చికిత్స అందించారు.

దుర్గ గుడికి యాత్రికుల రద్దీ



ఆలయ ఇఓ రామారావుకు అన్నదాన విరాళం చెక్కు అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనార్థం శుక్రవారం సందర్భంగా అమ్మవారి, స్వామి వారి దర్శనార్థం యాత్రికులు, భక్తులు విశేషంగా తరలివచ్చారు. దీంతో రద్దీ కనిపించింది. వేసవి దష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో కె.ఎస్. రామారావు విస్తృత ఏర్పాట్లు చేశారు. నిత్య ఆర్జిత సేవలైన శ్రీ స్వామి వారి అభిషేకం, శ్రీ అమ్మవారి ఖడ్గమాలార్చన, లక్షకుంకుమార్చన, శ్రీ చక్రనవావరణార్చన, చండీ హోమం, శాంతి కళ్యాణం మరియు ఇతర సేవల యందు భక్తులు విశేషంగా పాల్గొని, శ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు.

అన్నదానానికి విరాళం అందజేత

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆలయం నందు ప్రతిరోజూ జరుగు నిత్య అన్నదానము పథకంనకు గుంటూరుకి చెందిన దాత ఒంటెద్దు ఓబుళరెడ్డి మరియు కుటుంబ సభ్యులు రూ.1,00,000లను ఆలయ ఈవో కె ఎస్ రామరావుని కలిసి శుక్రవారం దేవస్థానానికి విరాళంగా అందజేశారు. దాతకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం, వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించగా ఈవో అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న నగర పోలీస్ కమిషనర్ రామకృష్ణ

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను విజయవాడ నగర పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి రామకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి విచ్చేశారు. ఆలయ ఇఒ కె.ఎస్ రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. శ్రీ అమ్మవారి దర్శనానంతరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ ఇఒ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.



సిపి రామకృష్ణ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఓ రామారావు

మహిళలే నిర్ణేతలు !



ప్రజాశక్తి - వత్సవాయి :

మండలంలో ఖమ్మం పాడు, వత్సవాయి, భీమవరం, మంగోల్లు, చిట్యాల, గ్రామాల్లో ఈనెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మహిళల ఓట్ల శాతం ఎక్కువగా నమోదయ్యాయి. వత్సవాయి మండలంలో 90 శాతం పైగా ఓటర్లు ఓట్లు వేశారు. పోలింగ్ నమోదయ్య. వత్సవాయి మండలంలో 50 వేల 17 ఓట్లు ఉండగా వాటిలో పురుషులు 24,060, మహిళలు 25,957 మంది ఉన్నారు. మొత్తం ఓట్లు 45,105 ఓట్లు నమోదు కాగా వాటిలో పురుషులు 21586, 23,519 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులకంటే స్త్రీలు ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 6 గంటల నుండి 10 గంటలైనా ఓటర్లు ఓటు హక్కు వినియోగించు కోవడం కోసం వరుస క్రమంలో నిలబడిపోయారు. ఓటు హక్కును వినియోగించుకున్నారు. డబ్బాకపల్లి, వత్సవాయి, కన్నివేడు, మంగళ్ళు తదితరు గ్రామాల్లో రాత్రి 10 గంటలైనా ఓటును మాత్రం సద్వినియోగం చేసుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ శాతం 2024 సంవత్సరంలో ఎక్కువ శాతం రావటంతో నాయకుల్లో ఎవరు గెలుస్తారని సందేహపడుతున్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక మరి కొందరు మధ్యాహ్నం టైంలో ఇంటికి వెళ్లి సాయంత్రం నాలుగు గంటలకు వచ్చి ఓటమి వినియోగించుకున్నారు. అయినా బారులు తీరి ఉండటంతో వరుస క్రమంలో నిలబడి ఓటు వేసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ స్థాయిలో రెండు లక్షల 10,000 మంది ఓటర్లు ఉండగా 90 శాతం పైగా ఓటును వినియోగించుకోవడంతో ఓటర్లు ఎటువైపు ఓటు వేశారా అని ఉత్కంఠగా సాగుతోంది. దీంతో జూన్ 4 వరకు వేచి చూద్దాం అంటూ సరిపెట్టుకుంటున్నారు.



ఓటు వేసేందుకు క్యూలైన్లు నిలబడిన మహిళా ఓటర్లు (ఫైల్)



రెచ్చిపోతున్న మందుబాబులు

ప్రజాశక్తి-గన్నవరం : అసాంఘిక శక్తులకు గన్నవరం నియోజకవర్గంలో సుదీర్ఘ విస్తీర్ణం కలిగిన పోలవరం కాలువ గట్లు అడ్డాగా మారుతున్నాయి. పగలు. రాత్రి తేడా – లేకుండా మందుబాబులు రెచ్చి పోతున్నారు. నిత్యం గుంపులు గుంపులుగా చేరి పాగా వేస్తున్న వాళ్లతో పొలాలకు వెళ్లే రైతులు, గేదెలు, మేకలు కాసేందుకు వెళ్లే మహిళా పశు పోష కుల అవస్థలు అన్నీఇన్నీ కావు. మరోవైపు స్థానిక రైల్వేస్టేషన్, విజయవాడ అంతర్జా తీయ విమానాశ్రయం పరిసరాలు, ప్రైవేట్ లేఔట్ల వద్ద ఇదే తీరు. సాయంత్రం ఆరు దాటితే చాలు ఇంటి బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన దుస్థితి నెలకొంది. ఆకతా యిల చేసే చేష్టలతో స్థానికులు, బాటసా రులు బెంబేలెత్తుతున్నారు. రోడ్లపైనే మద్యం సేవిస్తూ.. నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వారికి భయం చెబుదా మని ప్రయత్నించిన వారిపైనే దౌర్జాన్యానికి ఒడిగడుతున్నారు.

పోలీసులు గస్తీ ఎక్కడ....?

తెంపల్లి, వీరపనేనిగూడెం, కొత్తగూడెం, గొల్లనపల్లి, వీఎన్పురం కాలనీ, బుద్ధవరంలోని ప్రైవేట్ లేఔట్లు, అజ్జంపూడి, దావాజీగూడెం వద్ద విమానాశ్రయ ప్రహరీ వెలుపలకి వెళ్లే ప్రాంతం, గన్నవరం మార్కెట్ యార్డు సమీపంలోని రైల్వే పైవంతెన వద్ద గుంపులుగా కూర్చుని మద్యం సేవిస్తున్నారు. ఆ సమయాల్లో ద్విచక్రవాహన చోదకులను ఆపి బెదిరించి డబ్బు కూడా కాజేస్తున్నారని సమాచారం. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు వెనకడుగు వేస్తున్నారు. మద్యం సేవించడంతో పాటు ఆ సీసాలను పగుల కొట్టి రోడ్లపై పడేస్తున్నారు. పోలవరం. ఏలూరు, బుడమేరు కాలువ గట్లపై పదుల సంఖ్యలో సంచరిస్తున్న మందుబాబులు, గంజాయి బ్యాచ్ స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో పోలీసుశాఖ ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేసి ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



విరాళం అందిస్తున్న దృశ్యం

విరాళం అందజేత

ప్రజాశక్తి-కోడూరు : కోడూరులోని శివరామకష్ణ క్షేత్రం పునర్నిర్మాణంలో భాగంగా భారీ బడ్జెట్ తో పూర్తి గ్రానైట్ తో నిర్మిస్తున్న శివరామకష్ణ క్షేత్రానికి అమెరికాలో నివాసం ఉంటున్న లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ సంస్థ వ్యవస్థాపకులు పూతబోయిన అయ్యప్ప స్వామి, తండ్రి పూతబోయిన వెంకట రామారావు కుటుంబ సభ్యులు రెండు లక్షల వెయ్యి నూట పదహారు రూపాయల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పూతబోయిన వెంకట రామారావు,జయ లక్ష్మి దంపతులు మాట్లాడుతూ కోడూరు శివాలయం పూర్తి గ్రానైట్ తో పునర్నిర్మించడానికి తమ వంతుగా రెండు లక్షల వెయ్యి నూట పదహారు రూపాయలు అందజేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాద్ బాబు, జూపూడి సుభాశ్ చంద్రబోస్, బడే భావన్నారాయణ, అన్నం శివరామకష్ణ, ఉల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్యానికి భూసార పరీక్షలు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు షైనీ, సుదర్శిని

ప్రజాశక్తి ఘంటసాల : నేలల ఆరోగ్యానికై రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థి నులు తెలిపారు. గ్రామీణ వ్యవసాయ కషి అనుభవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఘంటసాల గ్రామ శివారులోని రైతుల పొలాలను సందర్శించి రైతులకు భూసార పరీక్ష ఆవశ్య కతపై అవగాహన కలిగించారు. ఏ విధంగా భూసార పరీక్ష కొరకు నమూనా సేకరించాలో రైతులకు తెలియజేశారు. భూసార పరీక్షల వల్ల అధిక ఎరువులు వినియోగాన్ని తగ్గించి అవసరమైనంత మోతాదులో మాత్రమే అందించటం వల్ల నేల ఆరోగ్యంతోపాటు రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. నేలలో ఉన్న చౌడుకార లక్షణాలను కూడా సవరించుకోవటం వల్ల దిగుబడి సవరించుకోవటం వల్ల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంతో కళాశాల విద్యార్థులు కె.షైనీ, సుదర్శిని, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల ల డిగ్రీ ఆరవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షల ఫలితాల ను ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి శుక్రవారం విడుదల చేసారు. మొత్తం 8,827 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 8,687 మంది ఉత్తీర్ణులు అయ్యి 98.41 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే 1,250 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయగా 51.13 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ నెల 11 వ తేదీ న పరీక్షలు పూర్తి కాగా ఐదు రోజుల రికార్డు సమయం లో ఫలితాలు విడుదల చేసిన పరీక్షల విభాగం సిబ్బందిని ఉపకులపతి అభినందించారు. పునః మూల్యాంకనంకు దరఖాస్తు చేసుకొనే సప్లిమెంటరీ విద్యార్థులు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పరీక్షల విభాగం అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్ బాబు, ఫైనాన్స్ ఆఫీసర్ రతన్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య సుందర కష్ణ, సిడిసి డీన్ డా. రామశేఖర్ రెడ్డి, సహాయ ఆచార్యులు డా. ఎం బాబూ రెడ్డి, సూర్య కంప్యూటర్స్ సిబ్బంది, పరీక్షల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

అధిక రక్తపోటును నియంత్రించుకోవాలి : డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : అధిక రక్తపోటును నియంత్రించండి– ఎక్కువ కాలం జీవించండి అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి గీతాబాయి సూచించారు. ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి గీతాబాయి కార్యాలయంలో పట్టణంలోని ఆశా కార్యకర్తలకు, కార్యాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ అధిక రక్తపోటు లేదా బిపిని సైలెంట్ కిల్లర్ అని పిలుస్తారు. ఇది గుండె ఆరోగ్యం,స్ట్రోక్, మూత్రపిండాల వైఫల్యం వంటి వాటిపై ప్రభావితం చూపిస్తుందన్నారు. మీ రక్తనాళాల్లో పీడనం చాలా ఎక్కువగా ఉన్నప్పుడు అంటే 140/90 కంటే ఎక్కువ ఉంటే అధిక రక్తపోటు కింద లెక్కిస్తారన్నారు.. మీ రక్తపోటును క్రమం తప్పకుండా పరీక్షించుకోవటం మీ జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్యకరమైన ఆహారము తీసుకోవడం, ఆల్కహాల్,ను పొగాకు వంటి వాటిని మానివేయటం, ఒత్తిడి లేని జీవితాన్ని అలవాటు చేసుకోవటం వలన అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవడం జరుగుతుం



దన్నారు. ఒత్తిడి తో కూడిన జీవనశైలి, పనిలో శారీరక శ్రమ లేకపోవడం, ఎక్కువ ఆలోచించటం, కూర్చున్న చోటే పని చేయటంతో ఆనారోగ్యపరమైన ఇబ్బందులు రావడంతో పాటుగా బరువు పెరిగి అనేక వ్యాధులకు గురి అవుతుంటారన్నారు. వాటిలో ముఖ్యమైనది బిపి. ప్రస్తుత కాలమానం ప్రకారం 30 సంవత్సరాల దాటిన వారి నుండి బీపీ బారిన పడుతున్న రాన్నారు. దీని ప్రధాన లక్షణాలు తలనొప్పి, దష్టిలో సమస్యలు, ముక్కు నుండి బ్లీడింగ్ ,శ్వాస ఆడకపోవటం, అలసట, క్రమరహిత హదయ స్పందన, మూత్రపిండాల పనితీరు క్షీణించటం మొదలైన లక్షణాలలో ఏవైనా కనిపించిన వెంటనే వైద్యులను కలిసి వైద్య సలహాలతో తగిన మందులు వాడటం వలన బీపీని నియంత్రించ వచ్చున్నారు. బీపీ ఉన్నవారు తరచు చెక్ చేయించుకోవడం, క్రమం తప్పకుండా మందులు వాడటం, వైద్యుని సలహా మేరకు జీవనశైలిలో మార్పులు, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, శారీరక వ్యాయామం చేస్తూ బీపీని నియంత్రించుకోవచ్చున్నారు. ముఖ్యంగా ఆహారంలో ఉప్పును బాగా తగ్గించటం, శారీరకంగా చురుగ్గా ఉండటం, దూమపానం, మద్యపానాన్ని మానివేయటం, బరువు ఎక్కువగా ఉంటే తగ్గించుకునే వ్యాయామాలు చేయడం, కూరగాయలు పండ్లు ఎక్కువగా తీసుకోవడం, నడక, ఈత, పరుగు, డాన్స్ మొదలైనటువంటి వ్యాయామాలు చేయడం వలన అధిక రక్తపోటు బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవ చ్చన్నారు. ఈ సందర్భంగా సమావేశమునకు హాజరైన ప్రతి ఒక్కరికి వైద్యాధికారులు బీపీని పరీక్షించి వారికి తగిన సలహాలను, మందులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీడి వ్యాధుల నియంత్రణాధికారి డాక్టర్ హిమబిందు, డిపిఎమ్ఓ డాక్టర్ మహేష్, కార్యాలయ ఏవో సురేష్, ఇతర సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రికెట్ కిట్ అందజేస్తున్న బొబ్బ గోవర్ధన్

క్రికెట్ కిట్ అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండలం పాత ఎడ్ల లంక గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు బొబ్బ గోవర్ధన్ మోపిదేవి మండలం మేకనపల్లి గ్రామానికి చెందిన యువకులకు క్రికెట్ కిట్ అందజేశారు. శుక్రవారం అవనిగడ్డలోని టిడిపి పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గోవర్ధన్ క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేసి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహిస్తానని తెలిపారు. నైపుణ్యం ఉన్న క్రీడాకారులు గ్రామాలలో అనేకమంది ఉన్నారని సరైన ప్రోత్సాహం వసతులు లేక వారు వెనకబడి పోతున్నారని దీనిని దష్టిలో ఉంచుకొని క్రీడాకారులకు ప్రోత్సాహం ఇవ్వనున్నట్లు గోవర్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బండే రాఘవ, మేరకనపల్లి యువకులు, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్స్, టెక్నాలజీ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)/విజయవాడ : ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెండ్లూమ్స్ టెక్నాలజీ, వెంకటగిరి, తిరుపతి జిల్లా నందు డిప్లొమా ఇన్ హెండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్ టెక్నాలజీ కోర్సు ప్రవేశం కొరకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి కె. అప్పారావు తెలిపారు. ఈ కోర్సు ప్రవేశం కొరకు 15 నుండి 23 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు దరఖాస్తు చేసుకొనవచ్చున్నారు. పదవ తరగతి లేదా తత్సమానమైన పరిక్షలో విద్యార్థులు ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఇంటర్ మీడియట్ యం.పి.సి. గ్రూపు పాసైన విద్యార్థులకు పదవ తరగతితో పాటు ఐ.టి.ఐ. రెండు సంవత్సరములు పాసైన వారికి నేరుగా సెకండ్ ఇయర్ డిప్లొమా కోర్సునకు ప్రవేశం కలదన్నారు. షెడ్యూలు కులాలు,తెగలకు చెందిన విద్యార్థులకు గరిష్ట వయో పరిమితి 25 సంవత్సరములు ఉండాలన్నారు. డిప్లొమా మొదటి సంవత్సరంలో నెలకు రూ.1000, సెకండ్ ఇయర్ కు నెలకు రూ.1100 లు, థర్డ్ ఇయర్‌నకు నెలకు రూ.1200లు స్టయి పండ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వెంకటగిరిలో 53 సీట్లకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబరు 9399936872, 9866169908 ద్వారా సంప్రదించ వచ్చున్నారు. ఆసక్తి, అర్హత గల వారు జూన్ 1వ తేది లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ధరఖాస్తులను www.iihtv-gr.com ద్వారా పొందవచ్చుని, ఈ అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడి ముక్కల మండల పరిధిలోని రైతులకు, కౌలు రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాల పంపిణీ చేస్తున్నట్లు పమిడి ముక్కల మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లా డుతూ లంకపల్లి, తాడంకి, కష్ణాపురం, కపిలేశ్వరపురం గ్రామాల్లో అన్ని రైతు భరోసా కేంద్రాలలో సబ్సిడీపై విత్తనాలు ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకంపై తీసుకొచ్చి విత్తనాలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ పనులు ప్రారంభం అవుతున్నాయని కనుక మండలంలోని రైతులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





దూసుకెళ్లిన వ్యాను, పక్కన మృతిచెందిన వ్యక్తి, ఆ పక్కనే గేదె

టైర్ పగిలి పొలాల్లోకి దూసుకెళ్లిన వ్యాన్

వ్యక్తి దుర్మరణం, ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - మైలవరం, ఇబ్రహీంపట్నం : మినీ వ్యాన్ టైర్ పగిలి పొలాల్లోకి దూసుకెల్లడంతో ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరులో జరిగింది. వివరాల ప్రకారం గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన కలపాల ప్రసాదరావు, దూరు ఇర్మియా, కలకోటి ప్రవీణులు గేదెల వ్యాపారం చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో తిరువూరులో కొన్ని గేదెలను కొనుగోలు చేశారు. శుక్రవారం ఉదయం కొనుగోలు చేసిన గేదెలను మినీ వ్యాన్‌లో ఎక్కించుకొని మంగళగిరి వెళుతున్నారు. మార్గమధ్యంలో జి.కొండూరులోని పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే వ్యాన్ టైరు పంచర్ అయ్యి పగలటంతో వ్యాను అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో వ్యాను పైన కూర్చున్న కలకోటి ప్రవీణ్ (36) సంఘటన స్థలంలోని మృతి చెందాడు. వ్యాను లోపల కూర్చున్న ప్రసాద్‌రావు, ఇర్మియాలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జి.కొండూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నివాళులర్పిస్తున్న సామినేని ఉదయభాను

బాధిత కుటుంబానికి సామినేని పరామర్శ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని బూదవాడ గ్రామ వైసిపి నాయకులు మట్టా ప్రతాపరెడ్డి తల్లి సంవత్సరికం కార్యక్రమంలో ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి ఉదయభాను పూలమాలవేసి నివాళులర్పించారు.

పోలీసుల కవాతు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం మల్లేలలో ఎన్నికల అనంతరం శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు రాష్ట్రంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, రాజకీయ ప్రేరేపిత వ్యాఖ్యలు చేసినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించ కూడా స్వేచ్ఛ వాతావరణంలో ఉండాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో అక్రమ అపార్ట్మెంట్ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ హేమమాలిని, టౌన్ ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. పట్టణంలో ఆరో వార్డ్ యాదవ బావి వద్ద అనుమతికి మించి నిర్మిస్తున్న అక్రమ అపార్ట్మెంట్ అధికఫ్లోర్ నిర్మించడానికి వేసిన స్లాబ్ సెంట్రింగ్ ను టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కూల్చివేశారు. పట్టణంలో అక్రమంగా అనుమతులకు మించి అధిక ఫ్లోర్లను నిర్మిస్తే వాటిని కూల్చివేస్తామని బిల్డర్లను హెచ్చరించారు. నందిగామలో 200కు పైగా అక్రమ అపార్ట్మెంట్ నిర్మాణాలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగుతున్నా పాలకులు, అధికారులు ముడుపులు తీసుకుని అక్రమ అపార్ట్మెంట్ నిర్మాణాలు ప్రోత్సహిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. శుక్రవారం మొక్కుబడి కూల్చివేతలతో మున్సిపల్ కమిషనర్ టౌన్‌ప్లానింగ్ అధికారులు చేతులు దులుపుకున్నారు.



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

మంచినీటి సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పురపాలక సంఘ పరిధిలో గల కొత్త మున్నేరు నుండి పట్టణానికి మంచి నీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ కొత్త మున్నేరు మధిర బ్రిడ్జి వద్ద మేజర్ లీకేజిని వెంటనే రిపేర్ చేసి వాటర్ సప్లై పునరుద్ధించినట్లు నందిగామ మున్సిపల్ కమిషనర్ హేమమాలిని తెలిపారు. శుక్రవారం కీసర ప్రాంతంలో గ్రౌండ్ వాటర్ లెవెల్స్ పనులు పరిశీలించారు. అదనపు పంపింగ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో నిర్ణీత సమయంలో మంచినీటి సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు. పైపులైన్ లేని ప్రాంతాల్లో వాటర్ టాంకర్ల ద్వారా మంచి నీరు యదావిధిగా సరఫరా చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు తాగునీటి కొరకు హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నెం.9493814856కు సంప్రదించాలని, వాటర్ టాంకర్స్ ద్వారా మంచి నీరు సరఫరా చేయబడుతుందని తెలిపారు. ప్రజలందరూ కూడా నీటిని వృధా చేయకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలని కమిషనర్ తెలిపారు.



మంచి నీటి పైపులైను పునరుద్ధరణ చేస్తున్న దశ్యం

రచయిత ప్రసాద్ 11వ వర్ధంతి

ప్రజాశక్తి - కంచికచర్ల : కవి, గేయ రచయిత, ఉద్యమకారుడు, అనువాదకులు, వక్త కలేకూరి ప్రసాద్ 11వ వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చెవిటికల్లు రోడ్డులో గల కలేకూరి ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన పాటలతో ఉద్యమాలను బలో పేతం చేసిన కవి కలే కూరి ప్రసాద్ అని పలువురు కొనియాడారు. దళిత సాహి త్యంలో, తనదైన శైలిలో రచనలు చేసిన గొప్ప మేధావి కలే కూరి ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వేల్పుల రమేష్, తంగిరాల సుజినీ, చట్టి రవీంద్ర, కోదాటి మన్మధరావు, దగ్గుబాటి మనోహర్, తన్నీరు శ్రీను పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి బాలుడి అప్పగింత



ప్రజాశక్తి - తిరువూరు : తప్పిపోయి వచ్చిన బాలుడ్ని తిరువూరులోని పరిపూర్ణ అనాథాశ్రమం ఆదుకుంది. చిత్తూరు జిల్లా రేణిగుంటకు చెందిన నాగరాజు అనే పదేళ్ళ బాలుడు తెలియక రైలు ఎక్కి విజయవాడ చేరుకుని అక్కడనుండి వచ్చే వాహనంలో ఇతరుల సహాయంతో తిరువూరు వరకూ చేరుకున్నాడు. ఈ బాలుడు తిరువూరు పోలీసుల కంటపడ్డాడు. పోలీసులు బాలుడిని రక్షించి అతని పూర్తి వివరాలు తెలుసుకుని రేణిగుంట పోలీసులకు సమాచారం అందించారు. బాలుడి తల్లితండ్రులు వచ్చే వరకు అతన్ని పరిపూర్ణ హోమ్‌కి అప్పగించి బాలుని సంరక్షణ బాధ్యత పరిపూర్ణ వ్యవస్థాపకులు సిరికొండ నాగేశ్వరరావుకు అప్పగించారు.

బ్రహ్మోత్సవాలను సమన్వయంతో నిర్వహించాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామంలో గల ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 18 నుండి 25 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 22 రాత్రి 12 గంటలకు జరిగే కళ్యాణానికి వచ్చే యాత్రికులకు సౌకర్యాలు కల్పించేందుకు శుక్రవారం దేవాలయ కార్యాలయంలో వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్తు ఆధ్వర్యంలో నందిగామ రెవెన్యు డివిజనల్ అధికారి ఎ.రవీంద్రరావు అధ్యక్షతన వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రరావు మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జయప్రదం చేయాలని కల్యాణం సందర్భంగా దేవస్థానానికి వచ్చేలా యాత్రికులకు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృష్ణా నదిలో గజ ఈతగాండ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. దేవస్థానానికి వచ్చే యాత్రికుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో యాత్రికులకు వేసవి కాలం దృశ్య చలువ పందిళ్ళు ఏర్పాటు చేయడంతో పాటు యాత్రికులకు కాళ్లు కాలకుండా పట్టాలను దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలన్నారు. కళ్యాణం సందర్భంగా యాత్రికుల సౌకర్యార్థం మంచినీళ్లను ఏర్పాటు చేయడంతో పాటు స్క్రీన్లను ఏర్పాటు చేసి కళ్యాణం అందరికీ కనపడేలా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి శిరపరపు హేమలత దేవి జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ సిహెచ్.మల్లేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ ఎన్.నాగరాజు, జగ్గయ్యపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం జానకి రామ్, దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త ప్రతినిధి పి.రామ్ ప్రసాద్, మండల పరిషత్ అధికారి బి.సాంబశివరావు, జగ్గయ్యపేట ఆర్టీసీ, ఫైర్, ఎలక్ట్రికల్, మెడికల్, ఫిషరీష్ తదితర అధికారులు, వేదాద్రి గ్రామ పంచాయితీ సెక్రటరీ శ్రావణ్ కుమార్, వి.ఆర్.ఓ, రామ్ కో, హేమాద్రి ఫ్యాక్టరీల వారు పాల్గొన్నారని దేవస్థాన ఇఒ శిరపరపు హేమలత దేవి తెలిపారు.



సమావేశంలో ఆలయ అధికారులు, సిబ్బంది



టిడిపి గెలవాలని పాదయాత్ర

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించాలని, నారా చంద్రబాబు నాయుడు మరోమారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవ్వాలని ఆకాంక్షిస్తూ తన కోరిక నెరవేరేలా ఆశీర్వదించాలని భగవంతుడిని కోరుకుంటూ శుక్రవారం జగ్గయ్యపేట నుండి తిరుమలగిరిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికార సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, విజయవాడ ఎంపిగా కేశినేని శివనాథ్ (చిన్ని) అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని కూడా ఆకాంక్షించారు.



లింగాలపాడులో వేలం పాటలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆలయ భూములకు వేలంపాట


ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం లింగాలపాడు గ్రామంలో శుక్రవారం శ్రీ లక్ష్మీ పేరంటా ళు అమ్మవారి ఆలయానికి చెందిన భూములకు కవులు టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహించారు. పుట్రెల మారెమ్మ ఆలయం ఇఒ వై.సీతారామయ్య పర్యవేక్షణలో లింగాలపాడు తక్కెళ్ళపాడు శివారులోని అమ్మవారి ఆలయానికి చెందిన 60 ఎకరాల భూములకు కౌలు వేలం నిర్వహించారు. 25 ఎకరాలకు రూ.1,99లక్షలకు పలువురు రైతులు పాట దక్కించుకోగా మిగిలిన 35 ఎకరాల భూమి వేలంపాట వాయిదా పడిందని ఆలయ ఇఇన్‌ఛార్జి ఇఒ ఫణి కుమార్ తెలిపారు.

జన్మదినం సందర్భంగా సాయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : అనవసరమైన ఆర్భాటాలకు తావివ్వకుండా వినూత్న రీతిలో సేవా కార్యక్రమాల ద్వారా జన్మదినాన్ని నిర్వహించుకోవడం ముదావహమని సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ధర్మవరపుపాడు తాండకు చెందిన చలువాది ఉపేంద్ర తన కుమారుడు చేతన్ విరాట్ తొలి పుట్టినరోజును పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని, ఆదర్శనియమైనదని అన్నారు. కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో పేద విద్యార్థులకు రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు పేదలకు భోజనం పొట్లాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రావణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక శిబిరం : కలెక్టర్


ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : హజ్ యాత్రికుల కోసం గన్నవరం విమానాశ్రయం వద్ద ప్రత్యేక శిబిరాన్ని సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ హజ్ యాత్ర శిబిరం నిర్వహణపై సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు గన్నవరం విమానాశ్రయం వద్ద గల కేసరపల్లి గ్రామంలోని దుర్గాపురం జివిస్టి రోడ్డులో మార్గాన ఉన్న ఈద్గా జమా మసీదు వద్ద హజ్ యాత్రకుల కోసం ప్రత్యేకంగా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా శానిటేషన్, సంచార మరుగుదొడ్లు, నీటి సరఫరా ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్తుకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీసు అధికారులతో సమన్వయం చేసుకొని ఆర్ అండ్ బి అధికారులు బారికేడింగ్ ఏర్పాట్లు అవసరమైన చోట్ల ఏర్పాటు చేయాలన్నారు.భూమి చదును, మంచినీటి సౌకర్యం ఏర్పాట్లు చేయాలన్నారు. యాత్రికులకు అవసరమైన వైద్య శిబిరాలను, 108 అంబులెన్స్ వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. శిబిరం వద్ద ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక యంత్రాలను సిద్ధంగా ఉంచాలన్నారు.శిబిరం చుట్టుపక్కల సీసీ.టీవీ కెమేరాలను పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు.ఈ గూగుల్ మీట్లో హజ్ కమిటీ ప్రతినిధులు అబ్దుల్ ఖాదరు, అదనపు ఎస్పీ జి వెంకటేశ్వరరావు, గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి, డిపిఓ నాగేశ్వర్ నాయక్, డిఎంహెచ్వో డాక్టర్ గీతాబాయి, పంచాయతీరాజ్ ఎస్.ఈ. .విజయ కుమారి, ఆర్ అండ్ బి ఇంజనీర్ శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

రక్తదానం మరొకరికి ప్రాణదానం : ఆర్‌కె

ప్రజాశక్తి - గుడివాడ : అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడి మానవత్వాన్ని చాటాలని సామాజిక వేత్త మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గంట సుబ్రహ్మణ్యం శస్త్ర చికిత్సకు కావలసిన రక్తాన్ని కిరణ్ రక్తదానం చేశారు. రక్తదానం చేసిన కిరణ్‌ను ఆర్.కె, పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో చరణ్, శివ, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం

కార్మికులకు సంక్షేమ చట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి - గుడివాడ : అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ చట్టం అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏలూరు రోడ్డులోని సిపిఐ కార్యాలయంలో గుడివాడ నియోజకవర్గం సిపిఐ కమిటీ సమావేశాన్ని డి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా టి.తాతయ్య పాల్గొని మాట్లాడుతూ దేశంలో కోట్లాదిమంది అసంఘటిత రంగ కార్మికులు ఏ విధమైన సంక్షేమ చట్టాలు లేకుండా చాలీ చాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ముఠా కార్మికులుగా పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు ఏ విధమైన సంక్షేమ పథకాలు ప్రభుత్వం ద్వారా అందకపోగా ప్రభుత్వం నుండి అనేక సమస్యలు ఎదుర్కోవడం జరిగిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జులై 27, 28 తేదీలలో కష్ణాజిల్లా 12వ ఏఐటియుసి మహాసభలు గుడివాడలో నిర్వహించడం జరుతుందన్నారు. జులై 27న ఏఐటియుసి అనుబంధ కార్మిక సంఘాలు వేలాది మందితో భారీ ప్రదర్శన నిర్వహించడం, రాబోయే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను కొనసాగించాలని, ప్రైవేటైజేషన్ విధానాన్ని విరమించుకోవాలని, విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మకాన్ని నిలిపివేసి ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని, వీటికి అవసరమైన ముడిసరుకు ప్రభుత్వమే సప్లై చేయాలని, బందర్‌లో ఓడరేవును అభివద్ధి చేసి, కష్ణాజిల్లాలో నిరుద్యోగులుగా ఉన్న యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. తొలుత వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు విజయకుమార్ మృతికి 2ని၊లు మౌనం పాటించి ఆయనకు నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు, సహాయ కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ, కమిటి సభ్యులు కె.సురేష్, డి.రామకష్ణ, ఆర్.గౌర్నాయుడు, ఎం.పద్మారావు, వి.శామ్సంగ్, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి తాతయ్య



విలేకరులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ పట్టణం, పరిసర ప్రాంత రైతులు, కౌలు రైతులు విత్తనాల కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలని రైతు సంఘం సీనియర్ నాయకులు నీలం మురళీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గుడివాడ సిపిఎం కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చి రొట్ట విత్తనాలు 50శాతం సబ్సీడీతో రానున్నాయని గుడివాడ వ్యవయసాయ శాఖ కార్యాలయంలో తమకు కావలసిన జీలగ, పిల్లిపెసర, పచ్చి రొట్ట విత్తనాల కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కావున సదరు రైతులు, కౌలు రైతులు ఈ సబ్సీడీని వినియోగించుకోవాలని కోరారు. సొంత భూమి, కౌలు భూమి కలిసి 5ఎకరాలు ఉన్న రైతులు, కౌలు రైతులు అవసరమైన మేరకు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రూరల్ మండలం కన్వీనర్ శొంఠి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది

తాడిపత్రి, పల్నాడు ఘటనలపై

ఈసికి వైసిపి బృందం ఫిర్యాదు

ప్రజాశక్తి-విజయవాడ : తాడిపత్రి, పల్నాడులో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని వైసీపీ బృందం కోరింది. ఈ మేరకు శుక్రవారం వెలగపూడి సచివాలయంలో సీఈవో ముఖేష్ కుమార్ మీనాను కలిసి ఫిర్యాదున ఒదించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సార్వత్రిక ఎన్నికలలో పోలింగ్ సరళి చూసిన తర్వాత పలుచోట్ల తెలుగుదేశం శ్రేణులు పోలీసుల అండతో పేట్రేగిపోయారని మల్లాది విష్ణు ఆరోపించారు. తాడిపత్రి ఘటనే ఇందుకు ఓ ఉదాహరణగా చెప్పుకొచ్చారు. అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పోలీస్ బలగాలు స్థానిక శాసనసభ్యుడు కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై దాడి చేయడం బాధాకరమన్నారు. మహిళలు ఉన్నారని కూడా చూడకుండా ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి.. హింసాత్మకంగా ప్రవర్తించారన్నారు. అడిషనల్ ఎస్పీ రామకృష్ణ డైరక్షన్లోనే పోలీసులు ఇంటిపై దాడి చేశారని.. దీనిపై సీసీ ఫూటేజీతో సహా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు అందజేశామన్నారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి.. రామకృష్ణ చౌదరిని సస్పెండ్ చేయాలని కోరినట్లు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘంపై ఒత్తిడి తీసుకొచ్చి ఎక్కడైతే పోలీస్ అధికారులను కూటమి బదిలీ చేయించిందో.. ఆ ప్రాంతాలలోనే అధికంగా ఘర్షణలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. శాంతిభద్రతలను కాపాడటంలో, ప్రజలకు రక్షణ కల్పించడంలో అక్కడి పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారని.. దీనికి కచ్చితంగా ఐజీ నైతిక బాధ్యత వహించా లన్నారు. ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠిని సస్పెండ్ చేయాలని ఈసిని కోరినట్లు తెలిపారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా దాడులు, అల్లర్లు, హింసను ప్రేరేపిస్తూ.. తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటనలన్నింటిపై సమగ్ర విచారణ జరిపి.. రాష్ట్రంలో స్వేచ్ఛాయుత వాతావరణాన్ని నెలకొల్పాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు రావెల కిషోర్ బాబు, అంకంరెడ్డి నాగ నారాయణమూర్తి ఉన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

- నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి-విజయవాడ : ప్రజాసమస్యలపై దృష్టి సారించాలని వివిధ విభాగాల అధికారులను విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆయన పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. తన పర్యటనలో భాగంగా బందర్ రోడ్, బెంజ్ సర్కిల్, రామవరప్పాడు, ఏలూరు రోడ్, పాత ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, జి ఎస్ రాజు రోడ్ లో పర్యటించి పారిశుద్ధ నిర్వహణ పరిశీలించారు. తదుపరి అజిత్ సింగ్ నగర్‌లోని గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ఎక్సెల్ ఎక్సెల్ ప్లాంట్లో వ్యర్థాల నిర్వాహణ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధం మెరుగు పడాలన్నారు. శానిటేషన్ నిర్వహణలో ఎటు వంటి జాప్యం జరగరాదని అన్నారు. ప్రజలు ఏ విధమైన ఇబ్బందులు పడకూ డదన్నారు. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమ యంలో మరింత పటిష్టమైన పారిశుధ్య నిర్వహణ జరగాలన్నారు. రోడ్డుపైనున్న వ్యర్థాలు, కాలువల్లోని షిల్టును నిత్యం తొలగించాలని కోరారు. తాగునీరు, దోమల కారణంగా ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడరాదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శుభం నొకహ్వాల్ పాల్గొన్నారు.



సిబ్బంది విధులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

200 మందితో ఒకేసారి ఆవకాయ పచ్చడిపై వర్క్ షాప్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మన చిన్నప్పుడు ఆవకాయ పచ్చడి పట్టాలి అంటే ఇంటిల్లిపాది వచ్చేవారు. ఈ బిజీ ప్రపంచంలో ఇప్పుడు ఏ పచ్చడి అయినా మార్కెట్లో నుండి తెచ్చుకుంటున్నారు. మన సంప్రదాయాన్ని మర్చిపోకూడదని ఉద్దేశంతో రెడ్ ఎఫ్ఎం ఆధ్వర్యంలో త్రీ మ్యాంగోస్ స్పైసెస్ అండ్ పికిల్స్, ఫ్రీడమ్ గ్రౌండ్ నట్ ఆయిల్ వారితో కలిసి ఒకేసారి 200 మందితో కలిసి ఆవకాయ పచ్చడి పట్టే వర్కుషాప్ ను శుక్రవారం నగరంలో ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీదేవి దూపాటి , కనకదుర్గ రుచికరంగా ఆవకాయ పచ్చడి పెట్టే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా రెడ్ ఎఫ్ఎం ఆర్‌జె సుధాకర్, స్వీటీ, అన్యలు తమ మాటలతో ఉత్సాహంగా కార్యక్రమాన్ని సాగించారు. ఈ కార్యక్రమంలో రెడ్ ఎఫ్ఎం స్టేషన్ హెడ్ క్రాంతికుమార్, ప్రోగ్రామింగ్ హెడ్ ఆదిల్ బాషా ఆధ్వర్యంలో జరిగింది.



20, 21 తేదీల్లో విజయవాడలో

సూత్రా సమ్మర్ స్పెషల్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సూత్రా ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో ఈ వేసవి కాలంలో విస్తృత శ్రేణిలో సమ్మర్ స్పెషల్ దుస్తుల ప్రదర్శన, అమ్మకాలు విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో మే నెల 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.ప్రసాద్ తెలిపారు. సూత్రా ఎగ్జిబిషన్‌లో దుస్తులు, గౌన్లు, చీరలు, గృహ అలంకరణ వస్తువులు, కాస్మెటిక్స్, పాదరక్షలు, ఉపకరణాలు వగైరా మరెన్నో విభిన్న డిజైనర్ ఉత్పత్తులను ప్రదర్శిస్తామన్నారు. భారతదేశం అంతటా ఉన్న ప్రతిభావంతులైన భారతీయ ఫ్యాషన్ డిజైనర్లు తమ డిజైన్లను ప్రీమియం కస్టమర్లకు ప్రదర్శించడానికి సూత్రా ఒక వేదిక అని అన్నారు. ఈ ప్రదర్శనలో మహిళల ఎత్నిక్ వేర్, వేడుకలకు ధరించేవి, సంప్రదాయ దుస్తులు, వివాహాలకు కావలసినవి మొదలైనవి లభిస్తాయన్నారు. వార్డ్ రోబ్, ఎలిగేంట్ స్టోర్ డిల్లీహాట్, అపురూప, జైపూర్ వరల్డ్, వి-స్టూడియోస్- రాజస్థాన్, పెహచాన్, లష్, సిక్వియా క్లాతింగ్, రైన్స్-జైపూర్, నూర్ హేండ్ లూం శారీ-చందేరి, లాల్ గలియారా వంటి అనేక డిజైనర్ ఉత్పత్తుల సంస్థలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయని చెప్పారు.

పిఎంజె జ్యూయలర్స్ ఆధ్వర్యంలో

టెంపుల్ జ్యూయలరీ కలెక్షన్ ప్రారంభం



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పిఎంజె జ్యూవెల్స్ టెంపుల్ జ్యూవెలరీ కలెక్షన్‌ను ప్రారంభించినట్లు పిఎంజె షోరూమ్ హెడ్ నీరవ్ చల్లా తెలిపారు. నగరంలోని పిఎంజె జ్యూయలరీ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ దేవాలయాల దివ్య హస్తకళలకు చిహ్నంగా పవిత్రం పేరుతో ఈకలెక్షన్స్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. ఎంతో మంది కస్టమర్లు టెంపుల్ జ్యూయలరీ కోసం ఎదురుచూస్తున్నారని అటువంటి వారికి ప్రత్యేకంగా ఆభరణాలను అందించాలనే ఉద్దేశంతోనే ఈ జ్యూయలరీ ప్రారంభించామన్నారు. ఎప్పటికపుడు తమ వినియోగదారులకు ఇష్టమైన ఆభరణాలను అందించంలో తమ సంస్థ ముందుంటుందని తెలిపారు.

బాష్ ఆటోమేటిక్ వాషింగ్ మెషీన్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : గృహోపకరణాల పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న బాష్ సంస్థ నుండి సరికొత్తగా ఆటోమేటిక్ వాషింగ్ మెషీన్లను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు బాష్ సంస్థ మార్కెటింగ్ హెడ్ రాజశేఖర్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో నూతన వాషింగ్ మెషీన్లను మార్కెట్లోకి తీసుకువచ్చారు. అనంతరం మాట్లాడుతూ దుస్తుల శుభ్రత అవసరాలను తీర్చడానికి అత్యంత ఖచ్చితత్వంతో రూపొందించబడిన, మేడ్ ఇన్ ఇండియా సెమీ ఆటోమేటిక్ వాషింగ్ మెషీన్‌ల సరికొత్త శ్రేణిని పరిచయం చేసినట్లు తెలిపారు. అత్యుత్తమ ఫ్యాబ్రిక్ కేర్, సౌకర్యాన్ని అందించేలా చేస్తున్నామన్నారు. నాణ్యత, డిజైన్ పరంగా జర్మన్ ప్రమాణాలతో సరిసమానంగా తయారుచేసిన వాషింగ్ మెషీన్లు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అందిస్తున్నామన్నారు.

అను ఇనిస్టిట్యూట్లో అరుదైన చికిత్స

ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడికి విజయవంతంగా శస్త్రచికిత్స



చికిత్స చేయించుకున్న యువకుడితో వైద్యులు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : అత్యంత అరుదైన వ్యాధితో ప్రాణాపాయంలో ఉన్న ఓ యువకుడికి అను ఇనిస్టిట్యూట్ వైద్యులు పునర్జీవం ప్రసాదించారు. 21 ఏళ్ల వయసున్న స్టీఫెన్ అనే యువకుడు దీర్ఘకాలికంగా కామెర్లు, పొట్టలో అసాధారణంగా నీరు చేరడం వంటి సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నప్పటికీ ప్రయోజనం లేని పరిస్థితుల్లో, ప్రాణాపాయస్థితిలో అను ఇనిస్టిట్యూట్ వైద్యులను సంప్రదించాడు. అవసరమైన పరీక్షల అనంతరం, పేషెంట్ స్టీఫెన్ బడ్-చియారీ సిండ్రోమ్ అనే అత్యంత అరుదైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. లివర్ నుంచి చెడు రక్తాన్ని తీసుకువెళ్లే రక్తనాళాలన్నీ మూసుకుపోవడంతో ప్రాణాపాయానికి దారి తీసే సమస్యను బడ్-చియారీ సిండ్రోమ్ గా పిలుస్తారు. సాధారణంగా ఈ సమస్యకు లివర్ ట్రాన్స్ప్లాంటేషన్ చేయాల్సివుంటుంది. అధిక వ్యయం, లివర్ డోనర్ తదితర ఇబ్బందుల కారణంగా.. అప్పటికప్పుడు లివర్ మార్పిడి సాధ్యం కాదు కాబట్టి, ప్రత్యామ్నాయ చికిత్సా విధానాన్ని అవలంబించాల్సివచ్చింది. అను ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరో అండ్ కార్డియాక్ ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విభాగానికి చెందిన ప్రముఖ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ భవానీశంకర్ ఆధ్వర్యంలో పేషంటుకు అత్యంత సంక్లిష్టమైన చికిత్సను నిర్వహించారు. లివర్ పూర్తిగా పనిచేయని పరిస్థితుల్లో ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉన్నందున హుటాహుటిన చికిత్స చేశారు. డైరెక్ట్ ఇంట్రాహెపాటిక్ పోర్టోకావల్ షంట్ (డిప్స్) చికిత్సను విజయవంతంగా నిర్వహించి పేషెంట్ ప్రాణాలను నిలబెట్టారు. బైపాస్ తరహాలో నిర్వహించే ఈ చికిత్సలో.. కాలేయానికీ, గుండెకు చెడు రక్తాన్ని తీసుకెళ్లే (ఐవీసీ) రక్తనాళానికి మధ్య స్టెంట్ అమర్చి, లివర్ నుంచి చెడు రక్తం సక్రమంగా గుండెకు ప్రసరించేలా చేస్తారు. ఈ చికిత్స అత్యంత క్లిష్టమైనదది. చికిత్సా సమయంలో అధికంగా రక్తస్రావం జరిగి పేషెంట్ ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అత్యంత సంక్లిష్టమైన డిప్స్ చికిత్సను, అంతర్జాతీయ స్థాయి సాంకేతిక సదుపాయాలతో కూడిన అను ఇనిస్టిట్యూట్ లో డాక్టర్ భవానీ శంకర్ నేతత్వంలోని వైద్య బందం విజయవంతంగా నిర్వహించింది. చికిత్స ఫలితంగా పేషెంట్ స్టీఫెన్ ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడి వేగంగా కోలుకుంటున్నాడు. అత్యంత అరుదైన ఈ చికిత్సకు సంబంధించిన వివరాలను తెలియజేసేందుకు అను ఇనిస్టిట్యూట్ నందు శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ భవానీశంకర్ మాట్లాడుతూ అరుదైన చికిత్సల కోసం మెట్రో నగరాలకు తరలివెళ్లాల్సిన అవసరం లేకుండా, అను ఇనిస్టిట్యూట్‌లో అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అత్యంత క్లిష్టమైన చికిత్సను నిర్వహించేందుకు సహకరించిన అను ఇనిస్టిట్యూట్ క్యాథ్ ల్యాబ్ బృందానికి డాక్టర్ భవానీశంకర్ ధన్యవాదాలు తెలిపారు. అరుదైన చికిత్సను విజయవంతంగా నిర్వహించి, అను గ్రూప్ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసిన డాక్టర్ భవానీశంకర్ బృందాన్ని అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ జి.రమేష్, ఇతర డైరెక్టర్లు అభినందించారు.

అనుమతుల్లేకుండా ఇసుక తరలింపు







ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గం కంచల - కీసర గ్రామ ఇసుక స్టాక్ యాడ్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక మాఫియా తరలిస్తున్నారు. ఇసుక బిల్లులు ఇవ్వకుండా అనధికారికంగా వ్యవహారం సాగుతున్నట్టు తెలిసింది. ఇసుక స్టాక్ పాయింట్ నుంచి ఇసుక ఎప్పుడూ తరలించాలి. మైనింగ్, రెవిన్యూ, అధికారులు అనుమతి లేవని చెప్పినప్పుడు అక్రమ ఇసుక తరలింపునకు కంచికచర్ల పోలీసులు సహకరిస్తున్నారు. వర్షాకాలంలో నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పుడు ఇసుక తరలింపు చాలా కష్టం ఉంటుంది. భవన నిర్మాణ కార్మికులు, ఇల్లు నిర్మించుకునే వారికి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తీసుకుని వచ్చిన ఈ ప్రతిపాదన ఇసుక స్టాక్ పాయింట్.వేసవి కాలంలో కీసర ఇసుక స్టాక్ పాయింట్ ఏ అధికారులు అనుమతులు ఇచ్చారో తెలపాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇప్పుడు ఈ స్టాక్ పాయింట్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే వచ్చే వర్షాకాలంలో భవన నిర్మాణ కార్మికులకు పని దొరికేది ఎలా అని వారి కుటుంబాలు రోడ్డున పడుతుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



క్రీడాకారులకు ఎనర్జీ డ్రింక్‌ను అందజేస్తున్న దృశ్యం

క్రీడాకారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోయువ క్రీడాకారుల కోసం డాబర్ గ్లూకోజ్ సరికొత్తగా ఎనరైజ్ ఇండియా పేరుతో ప్రచారాన్ని ప్రారంభించినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ ప్రశాంత్ అగర్వాల్ తెలిపారు. నగరంలోని బాక్సింగ్ అకాడమిలో ఎనర్జీ డ్రింక్ డాబర్ గ్లూకోజ్‌ను శుక్రవారం ఉదయం క్రీడాకారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ఎప్పటికపుడు ఎనర్జీ డ్రింక్ అవసరమని దానిని దృష్టిలో ఉంచుకుని తమ సంస్థ సరికొత్తగా ఎనర్జీ డ్రింక్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఇది క్రీడల్లో రాణించడానికి అవసరమైన శక్తిని అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి దినేష్ కుమార్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ కోచ్ పట్టి ఇసాక్, పలువురు కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి

రెమ్యునరేషన్, సర్టిఫికెట్లు ఇవ్వాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - మైలవరం : ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బంది అందరికీ డ్యూటీ సర్టిఫికెట్, మైలవరం నియోజవర్గ పిఒ, ఎపిఒల రెమ్యునరేషన్ రూ.1750, జిల్లా వ్యాప్తంగా ఒపిఒల రెమ్యునరేషన్ రూ.750 ఇవ్వాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా డిఆర్ఒ వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుందరయ్య జిల్లా కోశాధికారి పి.నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా పలు సమస్యలు టీచర్స్ యు.టి.ఎఫ్ జిల్లా శాఖ దృష్టికి తీసుకొచ్చారు. వాటిలో మే 13న విజయవంతంగా సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో విధులు నిర్వహించిన ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఏ.పీ.వో లు, ఇతర పోలింగ్ అధికారులు (ఓ .పీ.వో), ఇతర సిబ్బందికి వారు డ్యూటీ చేసిన 3 రోజులు కాలానికి, ఏప్రిల్‌లో 12,13 తేదీలలో శిక్షణకు హాజరైన రోజు, మేలో 4, 6 తేదీల్లో హాజరైన శిక్షణ సంబంధించిన డ్యూటీ సర్టిఫికెట్ జిల్లాలోని అందరి ఆర్.ఓ ల ద్వారా ఆన్లైన్ లో ఇప్పించవలసిందిగా కోరారు. ఇతర పోలింగ్ ఆఫీసర్స్‌కి (ఓపిఓ) రెమ్యునరేషన్ జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ జిల్లాలో రూ.500లు మాత్రమే చెల్లించారన్నారు. ఒపిఒ మే 12, మే 13 పోలింగ్ కేంద్రాల వద్ద డ్యూటీ చేసి మే14 ఉదయం 11 గంటల వరకు బ్యాలెట్ బాక్స్‌లు అప్పగించడం కోసం విధులు నిర్వహించి ఉన్నారన్నారు. ఒపిఒలకు జిల్లాలో రెండు రోజులకు రూ.500 మాత్రమే ఇచ్చారన్నారు. మూడో రోజు రెన్యుమరేషన్ కూడా వారికి అప్పగించాలని వారు కోరారు. మైలవరం నియోజకవర్గం పరిధిలో పి.వో , ఏ.పీ.వో లకు రెమ్యూనరేషన్ రూ.1400 లు మాత్రమే ఇచ్చారని, జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల రూ.1700 లు ఇచ్చారని అందరికీ పిఒఎపిఒలకు ఇప్పించాలని కె.శ్రీనివాసరావు, సుందరయ్య కోరారు.

వాయుసైన్యంలో నియామక ర్యాలీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : భారత వాయు సైన్యం అఖిల భారత అగ్ని వీర్వాయు (సంగీత కారుడు) నియామక ర్యాలీలో పాల్గొనేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. 2 జనవరి 2004 నుండి 2 జులై 2007 మధ్య జన్మించిన అర్హత గల అవివాహిత పురుష, స్త్రీ అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఏదైనా ప్రభుత్వంనుండి కనీస పాస్ మార్కులతో మెట్రిక్యులేషన్ లేదా పదవ తరగతి ఉత్తీర్ణత సాధించాలన్నారు. సంగీత సామర్థ్యం ఉండి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి డిప్లమా లేదా తత్సమాన పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. వివరాలకు ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.